మానవుడి
చేతికి చిక్కిన
లక్ష్మీదేవిని
విడిపించుకోడానికి
విష్ణుమూర్తి పాట్లు?

# దగాపడినదేవుడు

యాళ్ల
అచ్యుత
రామయ్య
కథ

ఎప్పుడూ ఎంతో సందడిగా వుండే విష్ణులోకం— కర్ఫ్యూ విధించినట్లు— ఎందుకనో వెలవెల పోతోంది. శేషపాన్పుపై శయనించిన విష్ణుమూర్తి టీవీని చూస్తున్నాడన్న మాటేకానీ, ఆయన దృష్టంతా ఎక్కడో వుంది.

అంతలో 'నారాయణ, నారాయణ' అన్న మాటలు వినిపించేసరికి విష్ణుమూర్తిలో కొంత హుషారు కనిపించింది.


"నారదా! భూలోకమంతా తిరిగి వస్తున్నావు కదా— లక్ష్మీదేవి ఆచూకీ ఏమైనా తెలిసిందా?" అన్నాడు విష్ణుమూర్తి ఆత్రుతగా.

"తెలిసింది స్వామీ. భూలోకంలోని కొందమంది పెట్టుబడిదారీ కుటుంబాల వాళ్లు లక్ష్మీదేవిని కిడ్నాప్ చేసారు. బిర్లా, టాటా, రిలయన్స్, సింఘానియా, థాపర్... ఇలా ఓ ఇరవై కుటుంబాల వాళ్లు ఆ ముఠాలో ప్రధానసభ్యులు. వీళ్లే కాకుండా చిన్నచిన్న వ్యాపారస్తులూ, మధ్య తరగతి కుటుంబాల వాళ్లూ కూడా ఈ ముఠాలో చేరడానికి ఉవ్విళ్లూరుతున్నారు".

"ఇన్ని రోజులుగా లక్ష్మిని భూలోకంలో దాచేస్తే ఎలా? ఇంతకీ ఆ కిడ్నాప్ చేసినవాళ్ల డిమాండ్స్ ఏమిటటా?" టీవీ చూసి, చూసి— విష్ణుమూర్తికి కూడా భూలోక భాష బాగా ఒంటబట్టింది.

"ఇన్ని రోజులా! భూలోకంలోని కాలమానం ప్రకారం— లక్ష్మీదేవి వాళ్లబారిన పడి కొన్ని వందల సంవత్సరాలైంది. ఆమె పెర్మనెంట్‌గా వాళ్ల దగ్గరే పడివుండాలనేది వాళ్ల డిమాండ్ అన్నాడు నారదుడు.

"లక్ష్మి— స్వేచ్ఛాప్రియురాలు కదా,



ఆమెను బంధించడం నేరమని వాళ్లకు తెలియదా? నారదా— నాకు బొత్తిగా కాలక్షేపం కావడం లేదంటే— నువ్వా మధ్య భూలోకం నుండి టీవీ తీసుకొచ్చావు చూడు. అది చూస్తుంటే తెలుస్తోంది— డబ్బు పిచ్చిలో పడి మనిషి ఎంతగా దిగజారిపోతున్నాడో! నేనిప్పుడే భూలోకం బయల్దేరుతాను... లక్ష్మిని చెర నుండి

విడిపించి, మానవులకు కర్తవ్య బోధ చేస్తాను '' అన్నాడు విష్ణుమూర్తి ఆవేశంగా.

''స్వామి! ఇలాంటి పొరపాటు చేసే లక్ష్మీదేవి అలా చిక్కుకు పోయింది. మీరు కూడా వెళ్లారంటే— ఏ పోలీసులో, నక్సలైట్లో మిమ్మల్ని కూడా కిడ్నాప్ చేసేయగలరు ''.

''నా ఈ ప్రయత్నాన్ని ఆపకు, నారదా. భూలోకంలోని నా భక్తులలో ఒకరి అడ్రసు ఇవ్వు— వెడతాను''.

చేసేది లేక నారదుడు ''మీకు ఎదురు చెప్పతగ్గవాణ్ణి కాను, మీ ఇష్టం కానీ... మీ జాగ్రత్తల్లో మీరుండాలి. మనిషి అంత ప్రమాదకరమైన జీవి మరొకటి లేదు. ఇకపోతే... కరుణకుమార్ అని ఓ పెద్ద పారిశ్రామికవేత్త ఉన్నాడు. ఆయన అనుదినం మిమ్మల్ని పూజిస్తూ వుంటాడు'' అని చెప్పి, పూర్తి అడ్రస్ చెప్పాడు.

''నారదా, నేను ఇప్పుడే బయలుదేరాలనుకుంటున్నాను. కుబేరుడితో తన పుష్పక విమానాన్ని ఒకసారి పంపించమని చెప్పుతావా?''

''తమరు రెగ్యులర్‌గా టీవీ చూస్తున్నట్లు లేదు. ఈ మధ్యనే పుష్పక విమానాన్ని కాశ్మీర్ టెర్రరిస్టులు హైజాక్ చేసారు''.

''మరుగున పడిపోయిన నా శక్తులన్నిటినీ బయటకు తీసి— ఇప్పుడే భూలోకానికి బయల్దేరుతాను'' అన్నాడు విష్ణుమూర్తి నిశ్చయంగా.

* * *

విష్ణుమూర్తి సరాసరి కరుణకుమార్ నివసిస్తున్న పట్టణానికే బయల్దేరాడు. మధ్యలో ఆయనకో ఆలోచన వచ్చింది. తను ఒక్క కరుణకుమార్‌కే ఎందుకు ప్రత్యక్షమవ్వాలి? ఆ పట్టణ ప్రజలందరికీ ఈ భాగ్యాన్ని ప్రసాదించవచ్చు కదా!

వెంటనే విష్ణుమూర్తి ఆ పట్టణంలో బిజీగా వుండే ఓ సెంటర్‌లో ప్రత్యక్షమయ్యాడు. ఆయన నుండి వెలువడుతున్న గొప్ప తేజస్సును చూసి అక్కడకు చేరిన మానవుల హృదయాలు అద్భుతమైన ఆనందంతో నిండిపోయాయి. మనసులో ఏ దేవుణ్ణి తలుచుకుంటే వాళ్లకు ఆ రూపంలో ఆయన కనిపిస్తున్నాడు. సూర్య కుటుంబంతో సహా సమస్త నక్షత్ర మండలాలూ ఆయన ఉదరంపై తిరుగాడుతున్నాయి. రోడ్డుపై జనమంతా నిలిచి దేవుడికి చేతులెత్తి మొక్కుతు వుంటే— ట్రాఫిక్ అంతా జామ్ అయిపోయింది.

హఠాత్తుగా అక్కడున్న జనంలో కలకలం ప్రారంభమైంది. ఆ జనమంతా ప్రక్కనే వున్న పార్క్‌లోకి త్రొక్కుకుంటూ, త్రోసుకుంటూ పరుగులు తీస్తున్నారు.

జరిగిందేమిటో దేవుడికి అర్థం కాలేదు. ఒక్క మనిషి మాత్రం అక్కడే నిలబడి వున్నాడు. అందరూ వెళ్లిపోయినా, ఒక్కడైనా అసలైన భక్తుడు నిలబడినందుకు విష్ణుమూర్తి ఎంతగానో సంతోషించి, ''భక్తా! ఈ ప్రజలందరూ నన్ను వదలి ఎక్కడికి అలా పరుగుతీస్తారు?'' అన్నాడు.

''స్వామీ! ఆ పార్కులోనికి షూటింగ్‌కని చిరంజీవి వచ్చాడట. అందుకనే ఈ జనం అక్కడికి పరుగుతీసారు'' అన్నాడా వ్యక్తి.

"ఎవరా చిరంజీవి? నన్ను మించిన దేవుడా?" దేవుడి గొంతులో కించిత్తు అసూయ ధ్వనించింది.

"అతను దేవుడు కాదు— సినిమా హీరో"

ఆ మాట విని విష్ణుమూర్తి చాలా అవమానం ఫీలయ్యాడు. "పోనీలే— నిజమైన భక్తుడు ఒక్కడున్నా చాలు. నీకు చిరంజీవిపై అభిమానం లేదా నాయనా?" అన్నాడు విష్ణుమూర్తి.

"నేను ఎంత దురదృష్టవంతుణ్ణి కాకపోతే భగవంతుడు ప్రత్యక్షమైనా దర్శించుకోలేక పోతున్నాను. నేను పుట్టుక నుండీ గుడ్డోణ్ణి, స్వామీ".

"అవునా! నీకు దృష్టిని ప్రసాదించి— నా దివ్య మంగళ రూపాన్ని వీక్షించే అదృష్టాన్ని నీకు కలగజేస్తాను" అని విష్ణుమూర్తి దీవించాడు.

సెకనులో అతనికి కళ్ళు కనిపించడం, వెంటనే చిరంజీవి వున్న పార్క్ వైపుగా పారిపోవడం జరిగిపోయాయి.

విష్ణుమూర్తి మనసులోనే అనుకున్నాడు — 'నారదుడు చెప్పింది కరక్టే. అతడు ఇచ్చిన భక్తుడి అడ్రసుకు డైరక్ట్‌గా పోకుండా, ఈ అలగా జనాలందరికీ ప్రత్యక్షమవడం నాదే తప్పు".

* * *

ఎయిర్ కండిషన్డ్ పూజా మందిరంలో కరుణకుమార్ కళ్ళు మూసుకుని ధ్యానంలో వున్నాడు.

"భక్తా!" అన్న సుమధురమైన స్వరం వినిపించగానే అతను ఆశ్చర్యపోయాడు. ఆ గదిలో తను తప్ప మరెవరూ లేరే! తలుపు లోపలివైపు గడియ వేసి కూడా వుంది.

"కళ్ళు తెరవయ్యా కరుణకుమారా!"

కరుణకుమార్ తన కళ్ళను తనే నమ్మలేక పోయాడు. ఎదురుగా విష్ణుమూర్తి! ఆయన నుండి చుట్టుప్రక్కలకు విస్తరించే కాంతి వలయాలు కరుణకుమార్

## నాన్‌స్టాప్ లెక్చరర్

సురేష్ ఫట్‌నిస్ అనే 51 సం.ల వ్యక్తి పూనాలో ఓ కాలేజ్‌లో మేథమెటిక్స్ లెక్చరర్. అయితే ఇతను 24 గంటల సేపు నాన్‌స్టాప్‌గా విద్యార్థులకు మేథమెటిక్స్ చెప్పి లిమ్కా బుక్ ఆఫ్ ఇండియన్ రికార్డ్‌లో స్థానం సంపాదించాడు. 11 ఏప్రిల్ 1992న ఉదయం 7.10 ని.లకు క్లాస్ మొదలు పెట్టి, 12 ఏప్రిల్ 1992 ఉదయం 7.10 వరకూ నాన్‌స్టాప్‌గా చెప్పి పేరు సంపాదించాడీయన.

— రజనీ శకుంతల (సికింద్రాబాద్)



శరీరానికి తాకి, కంపనకు గురైంది. దేవుని దివ్యహాసం చూడగానే అతని హృదయంలో మాధుర్యం పొంగిపొర్లింది. పట్టు పీతాంబరాలతో, వజ్రవైడూర్యాలతో ధగద్ధగాయ మానంగా వెలిగి పోతున్న దేవుణ్ణి ఎంతసేపు చూసినా అతనికి తనివి తీరడం లేదు.

"భగవాన్! ఇన్నాళ్లకు కరుణించావా?" అని కరుణకుమార్ దేవుడి కాళ్లపై పడి మొక్కాడు.

"నాయనా, నీ భక్తి శ్రద్ధల గురించి నారదుడి ద్వారా చాలా విన్నాను. మనిషి తుచ్ఛమైన కాంతా కనకాలకు లొంగిపోయి, ఉత్కృష్టమైన మానవ జన్మను వృథా చేసుకుంటున్నాడు. నీ భక్తికి మెచ్చి మోక్షాన్ని ప్రసాదిస్తున్నాను...."

కరుణకుమార్ సంతోషమంతా ఒక్కసారిగా గాలిలోకి ఎగిరిపోయింది. "స్వామి, ఒక్క నిముషం ఆగు మోక్షమా? అంటే?'

"అదేనయ్యాయ, జన్మరాహిత్యం... అంటే చావు పుట్టుకలనేవి లేకుండా పోవడం..

"భలే వాడివయ్యా, బాబూ! ఒకవేళ పొరపాటున దేవుడనే వాడు ఎక్కడైనా వుంటే— ఓ నమస్కారం పారేస్తే ఎందుకైనా మంచిదని— కోరిన కోర్కెలు తీరుస్తాడేమోనన్న ఆశతో నిన్ను పూజిస్తున్నాం కానీ... ఇలాంటి పనికిమాలిన మోక్షాలు మాకెందుకూ? నన్ను వెంటనే స్వర్గానికి తీసుకుపోతానన్నా నేను రాను. తగినంత డబ్బు చేతిలో వుండాలే కానీ, మీ స్వర్గం కూడా మా భూలోకం ముందు బలాదూర్. మీ స్వర్గంలో నాకు నచ్చని విషయమేమిటంటే— అక్కడున్న సౌఖ్యాలన్నీ అందరూ ఒకే రకంగా అనుభవిస్తారు. అదే భూలోకంలో అయితే— అనేకమంది ఆకలి మంటలలో కాలుతూ వుంటే— మా లాంటి అదృష్టవంతులు కొద్ది మందిమి సమస్త సుఖాలను అనుభవిస్తూ వుంటాం. అప్పుడే అందులోని మజా తెలిసి వస్తుంది. నీకేమన్నా చాతనయితే— ఈ జన్మలోనే నేను బోల్డన్ని సంవత్సరాలు బతికేటట్లు, కోరుకున్నంత బంగారాన్ని పొందేటట్లు వరం ఏదైనా ఇవ్వు— నీకు చంద్రమండలంలో కూడా గుడి కట్టిస్తాను" అన్నాడు కరుణకుమార్.

భగవంతుడికి మతిపోయింది. "నా దివ్య తేజస్సు నీలోని అజ్ఞానాంధకారాన్ని పారద్రోల లేకపోయిందంటే, మనుష్యులను పట్టి పీడిస్తున్న డబ్బు జబ్బుకు ఎంతటి నిరోధక శక్తి వచ్చేసిందో కదా!" అన్నాడు.

"స్వామీ, నీ మాటలు వింటుంటే— నీకసలు మహిమలంటూ ఏమైనా వున్నాయా అన్న డౌటు వస్తోంది. మేం అనవసరంగా నిన్ను పూజిస్తూ టైం వేస్ట్ చేసుకోవడం లేదు కదా!"

ఆ మాటలకు దేవుడికి కోపం వచ్చేసింది. "భక్తా! నా విశ్వరూపాన్ని చూపించమంటావా?" అన్నాడు.

"వద్దులే, ఈ మధ్య టీ.వీ.ల్లో చూసి చూసీ చాలా బోరు కొట్టేసింది. నీకు చేతనైతే నా ఇంటినంతా బంగారంగా మార్చేసేయ్" అన్నాడు కరుణకుమార్ ఆశగా.

“చూడు నాయనా, బంగారం పిచ్చి నిన్ను మహమ్మారిలా ఆవహించింది. ముందు దాన్ని జయించు” అన్నాడు దేవుడు దీనంగా.

అంతలో ప్రక్కనేవున్న ఫోన్ మ్రోగడంతో కరుణకుమార్ రిసీవర్ అందుకున్నాడు.

“హలో...ఆ...నేనే కరుణకుమార్ ని. ఏమిటీ... దేవుడి విగ్రహం త్రవ్వకాలలో బయట పడినట్లు చూపినా కూడా, కూలీవా కొడుకులు గుడిపెలక్కడి నుండి తీయమంటున్నారా? ఎన్ని తలలు లేచినాసరే - సరిగ్గా అక్కడే దేవాలయం కట్టితీరాలి. కావాలంటే మన మనుష్యులను మరి కొంత మందిని తీసికెళ్ళు. నా పేరెక్కడా బయటకు రాకూడదు సుమా! ఓ.కే...” అని ఫోన్ పెట్టేసాడు.

దేవుడికి తల తిరుగుతోంది. “కరుణకుమార్! ఫలానా చోటనే గుడి కట్టాలనుకోవడమేమిటీ? అందులో నన్ను ప్రతిష్ఠించడమేమిటి? నేను సర్వాంతర్యామినని తెలియదా?”

విష్ణుమూర్తి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. “ఛ... మీ మనుషులు దేవుళ్ళే ఎంత గొప్పగా వాడుకుంటున్నారయ్యా! నాకీ మానవ లోకమ్మీదే అసహ్యం కలిగింది. మీ చావేదో మీరే చావండి” అని దేవుడు బయల్దేరడానికి సిద్ధమయ్యాడు.

కురుణకుమార్ కంగారుగాలేచి, “శాంతించండి స్వామీ! ఇంటికొచ్చిన అతిథికి కనీసం పానీయాన్నయినా ఇవ్వడం ఆచారం' అంటూ ఫ్రిజ్ లో నుండి ఓ సీసా తీసి, అందులోని పానీయాన్ని గ్లాసులో పోసి అందించాడు.

కాస్తయినా అతను ఇంకా ప్రేమాభిమానాలు చూపినందుకు విష్ణుమూర్తి సంతోషపడ్డాడు. వెంటనే గడగడా ఆ పానీయాన్ని త్రాగేసాడు. కొద్ది నిముషాల్లోనే... ఏదో నిషా ఆవహించింది. కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్ళు వణుకుతున్నాయి. వికారంగా కూడా వుంది. మెదడంతా మొద్దు బారిపోయింది.

చాలాసేపటి తరువాత దేవుడుకి మెలకువ వచ్చింది. అక్కడెక్కడా కరుణకుమార్ కనిపించలేదు. విష్ణుమూర్తి తన శరీరం వంక చూసుకునేసరికి— ఆశ్చర్యం— బంగారంతో చేసిన గద, కిరీటం, దండ కడియాలూ— ఆఖరికి ఒంటిమీది పట్టుపీతాంబరాలతో సహా లేవు.

“వార్నీ, మానవా! ఎంతటి ఘోరానికి తలపడ్డావురా! మీలాంటి దుర్మార్గులు కొద్ది మంది చేరి లక్ష్మిని గుప్పిటిలో బందీ చేయడం వల్ల కాదూ— కోట్లాది ప్రజలు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నదీ! నేనే మనిషి చేతిలో ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నానంటే, పాపం—లక్ష్మి ఎన్ని కష్టాలు పడుతోందో? ఈ పరిస్థితులలో లక్ష్మిని విడిపించడం నా ఒక్కడితో అయ్యేపనికాదు. సమస్త దేవతలనూ కలుపుకుని వచ్చి, ఈ దురాశాపరులైన మానవులపై యుద్ధం ప్రకటించాల్సిందే!” అని దేవుడు అదృశ్యమైపోయాడు.

●